నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా..

ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

జైనథ్, జనవరి 17 : ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధిని పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే స్వగ్రామమైన మండలంలోని ఆడ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారంనిర్వహించిన సన్మానసభకు ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. జైనథ్, బేల, ఆదిలాబాద్ మండలాలతోపాటు ఆదిలాబాద్ ప్రజా సమస్యలను దగ్గరుండి పరిష్కరిస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ దంపతులను గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి లోక ప్రవీణ్ రెడ్డి, పార్లమెంటరీ కన్వీనర్ మయూర్ చంద్ర, బీజేపీ జైనథ్ మండలాధ్యక్షుడు కట్కం రాందాస్, జిల్లా మండల నాయకులు దశరథ్, వెంకన్న, సీతారాం, రమేశ్, ఆదినాథ్, దత్తనికం, సర్పంచ్ పాయల్ శరత్, గ్రామస్తులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మజ్ను వెబ్ చిత్రం పోస్టర్ల ఆవిష్కరణ

ఎదులాపురం, జనవరి 17 : భలా స్టూడియోస్ నిర్మాణంలో దర్శకుడు సాయిచరణ్ నిర్మించిన వెబ్ చిత్రం 'మజ్ను' పోస్టర్లను చిత్ర యూనిట్‌తో కలిసి ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆవిష్కరించారు. జిల్లా నుంచి వస్తున్న నటీనటులను ప్రజలు ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంచనవల్లి రత్నాకర్, రమేశ్, కిషన్‌గౌడ్, కబీర్‌దాస్, జానపద కళాకారుడు ఎం నర్సయ్య, నటీనటులు అనిరుద్, అంబిక, ప్రశాంత్, వినిత తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ఆదిలాబాద్ రూరల్, జనవరి 17 : ఆదిలాబాద్ పట్టణంలోని టూ టౌన్ పరిధిలోని డాల్డా కంపెనీ సమీపంలో నివాసముంటున్న ఓ యువతి అదృశ్యమైనట్లు వన్ టౌన్ సీఐ ఏ అశోక్ తెలిపారు. ఈ నెల 16వ తేదీన ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన యువతి, ఇంటికి తిరిగి రాలేదని చెప్పారు. దీంతో తల్లి చుట్టు పక్కలతో పాటు బంధువులను అడగ్గా ఆచూకీ లభించలేదని, దీంతో బుధవారం టూ టౌన్‌లో తల్లి ఫిర్యాదు చేసిందని తెలిపారు. ఎస్ఐ జీవీ రమణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జూడో క్రీడాకారుడికి రజతం

రజత పతకం సాధించిన ఎల్ లక్ష్మణ్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 17 : రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్‌లో జరుగుతున్న 67వ నేషనల్ ఎస్‌జీఎఫ్ఐ గేమ్స్ అండర్-19 జూడో పోటీల్లో తెలంగాణ స్టేట్ స్పోర్ట్స్ స్కూల్ పూర్వ విద్యార్థి ఎల్ లక్ష్మణ్ రజత పతకం కైవసం చేసుకున్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఈ విద్యార్థి, ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో జూడో శిక్షణ పొందుతున్నాడు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం జిల్లా క్రీడా పోషకులు, క్రీడా సంఘాల బాధ్యులు ఫోన్ ద్వారా ఆయనకు అభినందనలు తెలిపారు.

నిరుపయోగం.. క్రీడా మైదానం

బోర్డులకే పరిమితమైన ప్రాంగణం..

- నిధులు, స్థలాలు మంజూరు చేసిన కేసీఆర్ ప్రభుత్వం..
- క్రీడాకారులకు క్రీడా సామగ్రీ పంపిణీ
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న గ్రామీణ క్రీడాకారులు

నార్నూర్, జనవరి 17 : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కేసీఆర్ ప్రభుత్వం గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ప్రభుత్వ స్థలాల్లో మైదానాలు ఏర్పాటు చేసింది. అలాగే క్రీడాకారులకు క్రీడా సామగ్రిని కూడా సరఫరా చేసింది. అంతాబాగానే ఉన్నా ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో క్రీడామైదానాల్లో కనీస వసతులు లేక క్రీడాకారులు వెనుకంజ వేస్తున్నారు. దీంతో కేసీఆర్ ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతున్నది. రూ.లక్షల నిధులు వృథా అయ్యాయన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. నార్నూర్, గాదిగూడ మండల్లాల్లోన్ని పంచాయతీల పరిధిలో క్రీడా మైదానాలకు ఏర్పాటు చేసిన బోర్డులు మాత్రమే దర్శనమిస్తున్నాయి. ఎలాంటి నిర్వహణ లేక పిచ్చిమొక్కలు పెరిగి చిత్తడిగా మారాయి.

ఉమ్మడి మండలానికి 48 మైదానాలు..

ఉమ్మడి మండలం(గాదిగూడ, నార్నూర్) లోని 48 గ్రామ పంచాయతీలకు కేసీఆర్ ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను మంజూరు చేసింది. స్థలాల కొరతతో చాలా గ్రామాల్లో పాఠశాలల ఆవరణలు, పల్లె ప్రగతి వనంలో క్రీడా ప్రాంగణాల బోర్డులను ఏర్పాటు చేసింది. అన్ని చోట్లా బోర్డులను ఏర్పాటు చేశారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో వసతులు కల్పించడంలో అధికారులు, పంచాయతీ సిబ్బంది విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గంగాపూర్‌లో ఓ ప్రైవేటు పాఠశాల ముందు ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం బోర్డు

క్రీడా సామగ్రి పంపిణీ..

క్రీడకారులను అన్ని రకాలుగా సిద్ధం చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం గతంలోనే క్రీడా సామగ్రిని పంపిణీ చేసింది. క్రికెట్, వాలీబాల్, ఆరు డంబెల్స్, రెండు డిస్క్‌త్రోలు, 75 జతల ఆట వస్తువుల దుస్తులు అందాయని అధికారులు తెలిపారు. మండల అధికారుల పట్టింపులేని తనంతో క్రీడాకారులు సాధన చేసేందుకు వీలులేకుండా పోయిందని క్రీడాకారులు వాపోతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం పంపిణీ చేసిన క్రీడా సామగ్రి అలాగే మూలుగుతున్నదని, అధికారులు స్పందించి తమను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామీణ క్రీడాకారులు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకొస్తాం...



గ్రామాల్లో క్రీడా మైదానాలను వినియోగంలోకి తీసుకొస్తాం. అక్కడక్కడా చిన్నిచిన్న సమస్యలు ఉన్నాయి. స్థలం కొరత ఉన్నది వాస్తవమే. పాఠశాలల్లో స్థలం ఉండడంతో అక్కడ బోర్డులను ఏర్పాటు చేశాం. అక్కడే క్రీడాకారులకు ఆట వస్తువులను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటాం.

- రాథోడ్ గంగాసింగ్, ఇన్‌చార్జి ఎంపీడీవో, గాదిగూడ

గిన్నేరా-సాలేవాడకు నాగోబా ప్రచార రథం

- ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు
- నేడు పొల్లుగూడ గ్రామానికి..

ఇంద్రవెల్లి, జనవరి 17 : నాగోబా మహాపూజలతోపాటు, గంగాజలం సేకరణ కోసం నిర్వహించే పాదయాత్రపై గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్న ప్రచార రథం (చక్డా) ఇంద్రవెల్లి మండలంలోని గిన్నేరా గ్రామం నుంచి ఉట్నూర్ మండలంలోని సాలేవాడకు బుధవారం సాయంత్రం చేరుకున్నది. ఈ నెల 14 మండలంలోని కెస్లాపూర్ నుంచి బయల్దేరిన నాగోబా జాతర ప్రచార రథం బుధవారం సాలేవాడ గ్రామానికి చేరుకోగా, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. నాగోబా జాతర ఎడ్లబండి(చక్డా)ప్రచార రథంలో వెళ్తున్న కటోడ కోసు, పర్ధాంజీ దాదారావ్ మెస్రం వంశీయులు ఉన్న గ్రామాలకు చేరుకొని, నాగోబా జాతరతోపాటు ఫిబ్రవరి19న నిర్వహించే మహాపూజలు, జనవరి 21న గంగాజలం సేకరణకు బయలుదేరనున్న పాదయాత్రపై వివరిస్తున్నారు. సాలేవాడ నుంచి గురువారం బయల్దేరి మండలంలోని పొల్లుగూడ గ్రామానికి 18న చేరుకుంటారు. 19న మండలంలోని వడగాం గ్రామానికి చేరుకోగా, అక్కడి నుంచి 20న బయలుదేరి తిరిగి కెస్లాపూర్‌కు సాయంత్రం చేరుకుంటారు. జనవరి 21న కెస్లాపూర్ నుంచి గంగాజలం సేకరణకు పాదయాత్రగా బయల్దేరనున్నట్లు మెస్రం వంశీయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వంశీయులు పాల్గొన్నారు.

గిన్నేరా-సాలేవాడకు వెళ్తున్న ప్రచార రథంలో కటోడ కోసు, పర్ధాంజీ దాదారావ్

నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

నేరడిగొండ, జనవరి 17 : మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో గురువాం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు ఏఈ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సదస్సు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్‌శాఖ పరమైన సమస్యలుంటే ఈ వేదికకు హాజరై, పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

నార్నూర్, జనవరి 17 : విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో కావల రమేశ్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీల్లో చేపడుతున్న పనులు యథావిధిగా కొనసాగించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా మురుగుకాలువల్లో మురుగు తొలగించడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, చెత్తసేకరణ, సేంద్రియ ఎరువుల తయారీ, మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా కూలీలకు పనులు కల్పించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

శివాజీ చౌక్‌ను అభివృద్ధి చేయాలి

ఆదిలాబాద్ రూరల్, జనవరి 17 : ఆదిలాబాద్ పట్టణంలోని శివాజీ కూడలిని అభివృద్ధి చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు విన్నవించినట్లు శివాజీ సైనిక్ పట్టణాధ్యక్షుడు రాత్రే విద్యాసాగర్ తెలిపారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 19న శివాజీ మహారాజ్ జయంతి వేడుకల్లోగా అభివృద్ధి పనులు చేపట్టి, కూడలి చుట్టూ తోపుడు బండ్లను తొలగించాలని కోరారు. కూడలి పరిసరాలు దుర్గంధభరితంగా మారుతున్నాయని పేర్కొన్నారు.

టీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



డైరీలను అందజేస్తున్న రాష్ట్ర కార్యదర్శి రామ్‌చందర్

ఎదులాపురం, జనవరి 17 : టీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ అసోసియేషన్ ఆదిలాబాద్ జిల్లా కమిటీ నూతన డైరీని బుధవారం సంఘ భవనంలో రాష్ట్ర కార్యదర్శి కే రామ్‌చందర్, సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన రిటైర్డ్ ఉద్యోగస్తులు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డైరీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎన్‌హెచ్ రావు, కార్యదర్శి బీసీ పోచయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బీ దేవిదాస్‌చారి తదితరులు ఉన్నారు.

సునిల్ కుమార్‌కు శ్రద్ధాంజలి

ఎదులాపురం, జనవరి 17 : జిల్లా ఎస్సీ కార్యాలయంలో డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఎర్రగొల్ల సునిల్ కుమార్ మంగళవారం గుండెపోటుతో మృతిచెందాడు. కాగా, బుధవారం కార్యాలయంలో ఆయన చిత్రపటం వద్ద అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, డీఎస్సీడీవో భగత్ సునీత కుమారి, సూపరింటెండెంట్ జీ పూర్ణచందర్‌రావు, ఎస్‌డబ్ల్యూవోలు నారాయణ రెడ్డి, నర్సింగ్, సీనియర్ అసిస్టెంట్ ఆర్ అర్చన, జూనియర్ అసిస్టెంట్లు రుబియా, కవిత, మహేందర్, సిబ్బంది సాయి, తదితరులు ఉన్నారు.

ఫిబ్రవరి 1 నుంచి డ్రైవింగ్ ట్రైనింగ్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 17 : టీఎస్ ఆర్టీసీ ఆదిలాబాద్ డిపోలో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్ కొత్త బ్యాచ్ ఫిబ్రవరి 1వ తేదీ నంచి ప్రారంభిస్తున్నామని డీఎం కల్పన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15 నుంచి మరో బ్యాచ్ శిక్షణ ప్రారంభమైందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు డిపో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాం 30 రోజులు ఉంటుందని, రూ.15,600 ఫీజు ఉంటుందని వివరించారు. వివరాలకు డిపో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ షేక్ యూసుఫ్ 73828 40349, 99592 26002 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

డీఈవో ప్రణీతను కలిసిన ఉపాధ్యాయులు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 17 : రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ నూతన క్యాలెండర్‌ను ఆదిలాబాద్ పట్టణంలోని డీఈవో కార్యాలయంలో బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యలపై డీఈవోకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌యూపీపీ జిల్లా అధ్యక్షుడు చౌహాన్ దేవిదాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక పొచ్చన్న, రాష్ట్ర నాయకులు సోమ శ్యాంసుందర్, జావిద్, రాష్ట్ర మాలి సంఘం అధ్యక్షుడు సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన ఎస్పీ

న్యాయమూర్తిని కలిసిన ఎస్పీ

ఎదులాపురం, జనవరి 17 : ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన గౌస్ ఆలం బుధవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్కను అందజేశారు. ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి పీ శివరాం ప్రసాద్ కలిశారు. అనంతరం జిల్లా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, ఇతర అంశాలపై చర్చించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
★త్రివేణి హాంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319415-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

తైబజార్ వేలం రూ.9 లక్షలు

వేలంలో పాల్గొన్న వ్యాపారులు

ఇంద్రవెల్లి, జనవరి 17 : కెస్లాపూర్ నాగోబా జాతర తైబజార్‌ను రూ.9,00,900కు పలువురు వ్యాపారులు దక్కించుకున్నట్లు దేవాదాయ శాఖ నాగోబా ఆలయ ఈవో రాజమౌళి తెలిపారు. దర్బార్ హాల్‌లో బుధవారం ఉట్నూర్ ఆర్డీవో జీవకర్‌రెడ్డితో పాటు దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో తైబజార్‌కు వేలం పాట నిర్వహించారు. తైబజార్‌ను రూ.7,25,000కు గేడం మనోహర్ దక్కించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. జాతరలోని దుకాణాలతోపాటు ఆలయానికి విద్యుత్ సరఫరాను రూ.1,28,000కు బాబాఖాన్, ప్యాలాలు, పుట్నాల అమ్మకాలను రూ.44 వేలకు టీ నరేశ్, కొబ్బరి కాయల విక్రయాన్ని రూ.12 వేలకు మెస్రం కోసుపటేల్, మెస్రం నాగోరావ్ దక్కించుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, గిర్దవార్ మెస్రం లక్ష్మణ్, మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌పటేల్, సర్పంచ్ మెస్రం రేణుకానాగ్‌నాథ్, గ్రామస్తులు తోడం సాగర్, ఆనంద్‌రావ్, సంజీవ్, షేకు, షేగ్‌నాథ్, చిత్రు, దేవాదాయ శాఖ అధికారులు రమేశ్, అరుణ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణ బకాయిలు చెల్లించాలి

జైనథ్, జనవరి 17 : మహిళా సంఘాల సభ్యులు స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలను బకాయి పడకుండా నెలనెలా కిస్తులు సకాలంలో చెల్లించాలని స్త్రీనిధి రీజినల్ మేనేజర్ పూర్ణచందర్‌రావ్ అన్నారు. జైనథ్ మండల కేంద్రంలో బుధవారం స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలను వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఈ రుణాలు చాలా పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే చెల్లించి తిరిగి, కొత్త రుణాలు పొందాలని సూచించారు. స్త్రీనిధి ద్వారా కుటీర పరిశ్రమలు, చిన్న, చిన్న వ్యాపారాలకు సైతం రుణాలు మంజూరు చేస్తామన్నారు. దీంతోపాటు కాపి, కరంజీ గ్రామాల్లో సైతం స్త్రీనిధి రుణాలను వసూలు చేశారు. ఆయన వెంట ఏపీఎం భగవాండ్లు, సీసీ గంగారాం, వీవోఏలు సురేష్, రామన్న, అనురాధ పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న పూర్ణచందర్‌రావ్

జోగు రామన్న పరామర్శ

ఆదిలాబాద్ రూరల్ : కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్ రూరల్, జనవరి 17 : ప్రముఖ పాత్రికేయుడు బీర్కూరి వెంకటేశ్ తల్లి మంగళవారం రాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకాపూర్ గ్రామానికి చెందిన మర్సకోల మంతు మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీపీ రమేశ్, డీసీసీబీ డైరెక్టర్ పరమేశ్వర్, ఎంపీటీసీ జంగుబాపు, బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ, మాజీ ఎంపీపీ జగదీష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, కుమ్ర రాజు ఉన్నారు.

పద్మశాలీ సంఘం పరామర్శ..

బోథ్, జనవరి 17 : మండలంలోని దన్నూర్ గ్రామానికి చెందిన పద్మశాలీ సంఘం మండలాధ్యక్షుడు ఆచాల సదాశివ్ నానమ్మ ఇటీవల మృతి చెందారు. బుధవారం జిల్లా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆమె వెంట జిల్లా ఉపాధ్యక్షుడు జక్కుల వెంకటేశ్, పాముల గంగారాం, పట్టణాధ్యక్షుడు మెరుగు భోజన్న, సురేందర్, గిరీశ్, సామల నారాయణ, శంకర్, బుచ్చన్న, లక్ష్మణ్, దన్నూర్ పట్టణాధ్యక్షుడు సామల సంతోష్, రమేశ్, రవీందర్ తదితరులు ఉన్నారు.

భోజారెడ్డి ఆరోపణలపై మున్సిపల్ చైర్మన్ ఫైర్

మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 17 : రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరన్న నానుడికి డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి నిదర్శనంగా నిలుస్తున్నారని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. మాజీ మంత్రి జోగు రామన్నపై డీసీసీబీ చైర్మన్ చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయ మాట్లాడుతూ.. తమ వ్యక్తిగత విషయాలు, కుటుంబం గురించి మాట్లాడడం సరికాదన్నారు. ఆయన కుటుంబం గురించి తామూ దుష్ప్రచారాలు చేసేందుకు ఎంతో సమయం పట్టదని, కానీ ఆ సంస్కారం తమకు ఉన్నదని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో గొడవలు జరిగాయంటూ చేసిన ఆరోపణలను కొట్టిపారేశారు. తనకు డబ్బు మీద వ్యామోహం లేదన్న విషయాన్ని తెలుసుకోవాలని హితవుపలికారు. ఎన్నికల ఖర్చు గురించి కూడా అనవసర ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆ విషయాలపై అడ్డి భోజారెడ్డికి సంపూర్ణ అవగాహన ఉన్నదని పేర్కొన్నారు. డీసీసీబీ చైర్మన్ చేసిన ఆరోపణలు రుజువు చేయాలని సవాల్ విసిరారు. జోగు రామన్నపై ప్రతిపక్ష నేతలు చేసిన ఆరోపణలను తిప్పికొట్టిన డీసీసీబీ చైర్మన్, అధికార పార్టీలోకి వెళ్లి తిరిగి అవే ఆరోపణలు చేయడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. అధికారం ఎప్పటికీ శాశ్వతం కాదని, ఇకనైనా నైతిక విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని సూచించారు.

మురుగు కాలువ నిర్మాణానికి భూమి పూజ

భూమి పూజ చేస్తున్న ఎంపీపీ తుల శ్రీనివాస్

బోథ్, జనవరి 17 : మండలంలోని పట్నాపూర్ గ్రామ పంచాయతీలో ఎంపీపీ నిధుల నుంచి (రూ.4.28 లక్షలు) మురుగు కాలువ నిర్మాణానికి బుధవారం ఎంపీపీ తుల శ్రీనివాస్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల అభివృద్ధికి తనవంతుగా నిధులు కేటాయిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో ఇప్పటికే చాలా అభివృద్ధి పనులు చేపట్టి, మిగతా గ్రామాలకు పట్నాపూర్ ఆదర్శంగా నిలుస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రం సుగుణ, ఎంపీడీవో సుశీల్ కుమార్ రెడ్డి, ఎంపీటీసీ జుగాదిరావ్, పీఏసీసీ చైర్మన్ ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం..

పట్నాపూర్‌లో పూలాజీ బాబా భక్తుల సౌకర్యం కోసం ఆలయ స్లాబ్ నిర్మాణానికి ఎంపీపీ రూ.లక్ష విరాలంగా అందజేశారు. పట్నాపూర్ ఆధ్యాత్మిక చింతనకు మారుపేరన్నారు. భక్తుల కోసం షెడ్డు నిర్మాణ పనులు చేపట్టడం అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. కౌఠ(కే) గ్రామంలో పాఠశాల మరమ్మతుల పనులను ప్రారంభించినట్లు లిపారు. అనంతరం శ్రీధర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షులు ప్రశాంత్ పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు స్పందన

ఆదిలాబాద్ రూరల్, జనవరి 17 : ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో బుధవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన వచ్చినట్లు డీఎం కల్పన తెలిపారు. గిమ్మ గ్రామానికి చెందిన దేవిదాస్.. గిమ్మ నుంచి కోరట వరకు సాయంత్రం 4:30 గంటలకు ఒక ట్రిప్పు బస్సు కల్పించాలని కోరినటుల పేర్కొన్నారు. అందుకు డీఎం స్పందిస్తూ.. బస్సు నడిపిస్తామని తెలిపారు. అలాగే గిమ్మ గ్రామానికి ప్రస్తుతం నాలుగు ట్రిప్పులు నడుస్తున్నాయని, తిరిగి అదనంగా రెండు ట్రిప్పులు నడిపిస్తామని తెలిపారు. ఆదిలాబాద్‌కు చెందిన హరీశ్ ప్రస్తుతం నడుపుతున్న రాజధాని బస్సులు పాతవి అని, వాటి స్థానంలో కొత్తవి నడుపాలని కోరారు. ఈ విషయాన్ని హెడ్ ఆఫీస్ దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

రైతుల రాస్తారోకో..

జైనథ్(బేల), జనవరి 17 : బేల మండలంలోని బైపాస్ రోడ్డును నిలిపివేయాలని శంషాబాద్, దోస్గాల, మొబల్‌పూర్ గ్రామాల రైతులు బైపాస్ రోడ్డు వద్ద బుధవారం నిరసన చేపట్టారు. ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పు పట్టారు. ఈ రోడ్డు నిర్మిస్తే తమ సారవంతమైన భూములు కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బేల మండలం గుండా 4.5 కిలోమీటర్ల మేర ఉంటుందన్నారు. ఈ ప్రాంతంలోని బైపాస్ రోడ్డు వేయడం సరికాదని రైతులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు బైపాస్ నిర్మాణం చేపట్టాలనే ఉద్దేశాన్ని మానుకోవాలన్నారు. లేకపోతే రైతుల ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం తహసీల్ కార్యాలయంలో వినతి ప్రతం అందజేశారు.